## బెంగళూరుకు గులాములు కాంగ్రెస్ నేతలు..

- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మదిరిగింది
- బీఆర్ఎస్ తిరస్కరించిన నేతలకు టికెట్లు అమ్ముకున్న రేవంత్ రెడ్డి
- 90 పైగా సీట్లు గెలుస్తాం.. మూడవసారి అధికారం మాదే
- సమావేశంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం




ఎల్బీనగర్‌లో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 16 : బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను చూసి ప్రతిపక్షాలకు దిమ్మదిరిగి పోయిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎల్బీనగర్‌లో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు గతంలో ఢిల్లీకి గులాములుగా ఉండేవారని, ఇప్పుడు బెంగళూరు గులాములుగా మారారని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుంటూ రేటెంత రెడ్డిగా మారాడని ఆరోపించారు. బీఆర్ఎస్ తిరస్కరించిన నాయకులను పార్టీలో చేర్చుకొని టికెట్లు ఇస్తుందని విమర్శించారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా అని.. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. గత ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చని ఎన్నో పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేశారని, తాజాగా ప్రజల కోసమే అద్భుతమైన మ్యానిఫెస్టోను ప్రకటించారని తెలిపారు. ఎల్బీనగర్‌లో ఇప్పటికే ఒక రౌండ్ ఎన్నికల ఇంటింటి ప్రచారం పూర్తయ్యిందని, ఎన్నికల సమయానికి ప్రతి ఇంటిని 8మార్లు టచ్ చేస్తామన్నారు. ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఒక విజన్ ఉన్న లీడర్ అని, రాబోయే ఎన్నికల్లో 90కి పైగా సీట్లు గెలిచి మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జీవీ సాగర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, జిన్నారం విఠల్‌రెడ్డి, చెరుకు సంగీతా ప్రశాంత్‌గౌడ్, రమావత్ పద్మానాయక్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వర్‌రావు, గజ్జల మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్, త్రివేది, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి అహంకారంతోనే కాంగ్రెస్ సర్వనాశనం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రాజీవ్‌గాంధీనగర్ కాంగ్రెస్ పార్టీ నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 16 : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అహంకారంతోనే కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం అవుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బాలానగర్ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నితీశ్‌రెడ్డితో పాటు 50మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల నాయకత్వంలో హైదరాబాద్ నగరం కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి సాధించిందని, పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని.. సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కూకట్‌పల్లిలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి ఆదర్శవంతంగా అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ నేతలు అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని.. విజ్ఞత కలిగిన ప్రజలు బీఆర్ఎస్‌నే ఆదరిస్తారన్నారు. చేసిన అభివృద్ధి కండ్లముందే కనబడుతుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలని కోరారు. మరలా సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు.

## మూడు లక్షల..

- ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం
- నవంబర్ 3న రాష్ట్రానికి ఎన్నికల సంఘం ప్రత్యేక అబ్జర్వర్లు

# నకిలీ ఓట్లు రద్దు చేశాం

- నామినేషన్ ముగిసిన తర్వాత ఓటరు స్లిప్‌ల పంపిణీ
- 100 శాతం ఓటింగ్ నమోదుకు చర్యలు
- టోల్ ఫ్రీ నంబర్ 1950 ఫోన్ చేసి.. ఓటు వివరాలు తెలుసుకోవచ్చు
- ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాలో వంద శాతం ఓటింగ్ నమోదుకు తుది ఓటరు జాబితాను ప్రకటించామని, ఇప్పటి వరకు మూడు లక్షల నకిలీ ఓట్లను రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో ఓటింగ్ అవగాహన, ఎన్నికల నిర్వహణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. తుది జాబితాతో సంబంధం లేకుండా అర్హులైన 18సం. వయస్సు నిండిన ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని సూచించారు. నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో పేర్ల తప్పులు, ఇల్లు షిఫ్ట్ అయిన వారు అక్టోబర్ 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితా విడుదల చేశామని, అందులో పేరు ఉందో లేదో రీచెక్ చేసుకోవాలని సూచించారు. అందుకు టోల్ ఫ్రీ నంబర్ 1950, voter helpline app ద్వారా సరి చేసుకోవచ్చు లేదా voters.eci.gov.in వెబ్ సైట్ లేదా మీ దగ్గరలోని బీఎల్ఓలను సంప్రదించవచ్చన్నారు.

### ఏఎస్‌డీ లిస్ట్‌లను తయారు చేస్తున్నాం

ఓటరు తుది జాబితా విడుదలైన తర్వాత అక్టోబర్ 9వ తేదీ నాటికి 44,680 డెత్, డూప్లికేట్ ఓట్లను తొలగించామని తెలిపారు. గత నాలుగు నెలల నుంచి ఒకే కుటుంబ సభ్యుల పేర్లు అదే నియోజకవర్గంలో వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఉన్న 3,56,830 ఓట్లను సరిచేయడం జరిగిందని ఎన్నికల అధికారి తెలిపారు. నామినేషన్ ముగిసిన తర్వాత ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఓటరు స్లిప్ పంపిణీ సందర్భంగా ఏఎస్‌డీ లిస్ట్‌లను తయారు చేస్తున్నామని, ఈ జాబితాను సంబంధిత ఆర్ఓలకు అందజేస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా కొవిడ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని చెప్పారు. పోలింగ్ బూత్ వద్ద వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 80 సంవత్సరాలు పైబడిన దివ్యాంగులకు ఇంటి నుండే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఫారం-12డీ అందజేసినట్లు తెలిపారు. ఆప్షన్ ఇచ్చిన తర్వాత పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వేయకూడదని స్పష్టం చేశారు.

### లెక్కకు మించి నగదు తరలించవద్దు

నవంబర్ 3వ తేదీ నుంచి ఎన్నికల సంఘం ప్రత్యేక అబ్జర్వర్లు వస్తారని, అప్పటి నుంచి ఎస్ఎస్‌టీ టీమ్‌లను నియమించి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని రొనాల్డ్ రాస్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున పౌరులు లెక్కకు మించి నగదును తీసుకెళ్లినచో సంబంధిత ధృవ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. తనిఖీలో పట్టుబడిన సొమ్మును పరిశీలించడానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు.

### 70 లక్షల నగదును సీజ్ చేశాం

ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు ఇప్పటి వరకు 70 లక్షల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది రూ.18.9 కోట్లను సీజ్ చేయగా, 133 ఎఫ్ఐఆర్, 2,389 ఆయుధాల డిపాజిట్ చేసినట్లు చెప్పారు. లక్షా 50వేల వాల్ పెయింటింగ్, పోస్టర్ల తొలగింపు, 64,666 రాజకీయ నాయకుల విగ్రహాలను కప్పి ఉంచామన్నారు. 2,300 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 128 కేసులు బుక్ చేశామని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, అడిషనల్ కమిషనర్ శంకరయ్య, శరత్‌చంద్ర, డిప్యూటీ ఈఈ, అనంతం తదితరులు పాల్గొన్నారు.

### మేడ్చల్‌లో 24 గంటలు నిఘా

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 16: ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా నగదు, మద్యం, బంగారం తరలింపుపై నిరంతరం పోలీసులు, ఎన్నికల అధికారుల ప్రత్యేక నిఘా కొనసాగుతున్నదని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధి నిర్వహణలో పోలీసులు, ఎన్నికల అధికారులు నిరంతరం పని చేస్తున్నారని, ప్రతి రోజు పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ అమలు నుంచి సోమవారం వరకు నిర్వహించిన తనిఖీల్లో జిల్లాలో రూ.4,92,85,360 నగదు, రూ.3,04,66,728 విలువైన బంగారం, డైమండ్ ఆభరణాలు, 7,049 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని సీజ్ చేసి, నమోదైన 179 కేసుల్లో 136 మందిని అరెస్టు చేసినట్లు కలెక్టర్ వివరించారు. మరోవైపు స్వీప్, ఫిర్యాదులు, ఎన్నికల ఖర్చులు, ఎన్ఐసీ, ఎంసీఎంసీ, ఎంసీసీ నోడల్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు.

### డీఆర్సీ సెంటర్ పరిశీలన..

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి ఎల్బీనగర్ నియోజకవర్గానికి సంబంధించిన డీఆర్సీ సెంటర్‌ను సోమవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్వో అండ్ జోనల్ కమిషనర్ పంకజా, డీసీపీ స్వాతి, ఏఈఆర్ఓ రవీందర్, సంబంధిత అధికారులు ఉన్నారు

### గచ్చిబౌలి స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్



గచ్చిబౌలి బాలయోగి క్రీడా స్టేడియాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సోమవారం పరిశీలించారు. వెస్ట్‌జోన్ కమిషనర్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, మాదాపూర్ డీసీపీ సందీప్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దా

- గండిపేట మండల బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సన్నాహక సమావేశం
- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

మణికొండ, అక్టోబర్ 16 : తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే గోస పడుతారని చెప్పిన వారి నోళ్లు మూయించేలా దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దారని అన్నారు. సోమవారం తన కార్యాలయంలో గండిపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని సూచించారు. దళిత బంధు, బీసీ బంధు, రైతు బంధు, ఆసరా పింఛన్లు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు తదితర పథకాలను నియోజకవర్గంలో విజయవంతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేశామని చెప్పారు. రానున్న రోజుల్లో మరింత సహాయ సహకారాలు అందిస్తూ పేదల అభ్యున్నతికి పాటుపడతానన్నారు. తాను చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గండిపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.